

**అదుపులోకి డయేరియా**

- చినతీనార్లలో కొనసాగుతున్న వైద్య శిబిరం

8లో



**దేశ నాయకులే దేవతలు, దేవుళ్లు**

- ఏటా వారి పేరిట తీర్థ మహోత్సవాలు
- ఆదర్శంగా నిలుస్తున్న కె.జె.పురం గ్రామస్తులు

8లో

**స్టాఫ్ నర్సుల ఎంపిక నిలుపుదల**



- తప్పుల తడకలతో తుది జాబితా
- అన్యాయం జరిగిందని నర్సుల నిరసన
- జాబితాను మళ్లీ పరిశీలిస్తున్న అధికారులు

8లో

## న్యూస్‌రీల్

### 21, 22 తేదీల్లో రత్నాచల్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు పాక్షిక రద్దు

**తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర):** విజయవాడ–విశాఖపట్నం సెక్షన్ రేగుపాలెం–నర్సీపట్నం స్టేషన్ల మధ్య జరుగుతున్న ఆధునికీకరణ పనుల నేపథ్యంలో ఈ మార్గంలో ఈ నెల 21, 22 తేదీల్లో పలు రైళ్లు పాక్షికంగా, కాకినాడ మెము(17267/17268) పూర్తిగా రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. ఆ తేదీల్లో గుంటూరు–విశాఖపట్నం (17239/40) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ సామర్లకోట వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో సామర్లకోట నుంచి గుంటూరుకు చేరుకుంటుంది. ఆ రెండు రోజులు ఈ రైలు సామర్లకోట–విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించదు. విజయవాడ–విశాఖపట్నం(12718) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ తుని వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో తుని నుంచి విజయవాడకు చేరుకుంటుంది. ఆ రెండు రోజులు ఈ రైలు తుని–విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించదు.

### బీసీటీని సందర్శించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి



కేవీకే నర్సరీని పరిశీలిస్తున్న ముకేష్‌కుమార్ మీనా

**రాంబిల్లి:** హరిపురంలో గల భాగవతుల చారిటబుల్ ట్రస్టు(బీసీటీ) కార్యాలయాన్ని బుధవారం రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముకేష్ కుమార్ మీనా సందర్శించారు. వినికిడి యంత్రాలు పంపిణీ చేసేందుకు నిర్వహించిన శిబిరాన్ని తొలుత పరిశీలించారు. ఏపీ మెడ్‌టెక్ జోన్(విశాఖపట్నం) సహాయంతో వినికిడి యంత్రాలు అందజేస్తున్నారు. అనంతరం బీసీటీ కేవీకేను సందర్శించారు. కేవీకే నిర్వహిస్తున్న కార్యక్రమాలను శాస్త్రవేత్తలు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్ని కృష్ణ, తహసీల్దార్ భాగ్యవతి, మెడ్ టెక్ శాస్త్రవేత్తలు, అధికారులు, కేవీకే చైర్మన్ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

### పాలిమర్స్ టెక్నాలజీలో ఉచిత శిక్షణ

- ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంత యువతకు అవకాశం

**అక్కిరెడ్డిపాలెం(గాజువాక):** ఎన్టీపీసీ, సింహాద్రి సౌజన్యంతో భారత ప్రభుత్వ సంస్థ సీపీఈటీ 60 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సీఎస్‌టీఎస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో స్థానికంగా ఉండి, 10వ తరగతి విద్యార్హతతో 18 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన వారు శిక్షణకు అర్హులన్నారు. ఎంపికైన వారికి విజయవాడలో ఆరు నెలల పాటు పాలిమర్స్ టెక్నాలజీలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం వారికి సర్టిఫికెట్‌తో పాటు విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నై తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలతో పాటు నెలకు రూ.3 వేల స్టైఫండ్ అందిస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు సీపీఈటీ ప్రతినిధి బాణావతు అంజి నాయక్ లేదా 78935 86494కు సంప్రదించవచ్చు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెల 27వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని శేఖర్ సూచించారు.

### మట్టి అక్రమ తవ్వకాలపై దాడులు

- 11 ట్రాక్టర్లు, పొక్లెయిన్ స్వాధీనం



గనులశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

**మాకవరపాలెం:** అక్రమంగా మట్టిని తరలిస్తున్న 11 ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను గనులశాఖ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని భీమబోయినపాలెం రెవెన్యూలోని గండిపేట సమీపంలో మట్టిని తవ్వి తరలిస్తున్నట్లు గనులశాఖ అధికారులకు ముందుగా సమాచారం అందింది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం గనులశాఖ అనకాపల్లి ఏడీ రవివర్మ ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో 11 ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. అనంతరం ఈ వాహనాలను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్, ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఆవిష్కరణల వేదిక..

- అటల్ టింకరింగ్ ల్యాబ్‌లతో ప్రయోగాలపై విద్యార్థుల్లో ఆసక్తి
- నమూనాల తయారీలో ప్రతిభ చూపుతున్న బాలబాలికలు
- జిల్లాలోని 28 హైస్కూళ్లలో ల్యాబ్‌ల ఏర్పాటు

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్)లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఆధునిక పరికరాలతో కూడిన ప్రయోగశాలలను తీర్చిదిద్దారు. విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై ఆసక్తి చూపేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 28 పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేశారు. కొత్త ఆవిష్కరణల వైపు ఆసక్తి చూపేలా పరికరాలున్నాయి.



మూత్రపిండాల వ్యవస్థ నిర్వహణ



ల్యాబ్‌లో విద్యార్థులు తయారీ చేసిన రాకెట్ నమూనా

**కె.కోటపాడు:** ప్రభుత్వ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుతో సులభంగా గుర్తుండే విధంగా సైన్స్ పాఠ్యాంశాల్లో విజ్ఞానం విద్యార్థులకు అందుతోంది. ప్రత్యేక బోధనతో పాటు సంబంధిత నమూనాలను విద్యార్థులతో ఉపాధ్యాయులు తయారు చేయిస్తున్నారు. తద్వారా ప్రతీ అంశంపై వారికి పూర్తి అవగాహన కలుగుతోంది. ఆయా పాఠ్యాంశాల్లో నిర్వహించే పరీక్షల్లో మంచి మార్కులను పొందగలుగుతున్నారు.

**పలు నమూనాలు**

ఎ.కోడూరు హైస్కూల్‌లో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను 2020 జనవరి 9న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. ప్రత్యేకంగా ఓ గదిని కేటాయించి ల్యాబ్ నిర్వహిస్తున్నారు. టీచర్ డి.ఎస్.వి.ఆర్.వై. నాయుడు ప్రయోగాలపై విద్యార్థులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ల్యాబ్‌లో విద్యార్థులు రాకెట్, స్వయం నియంత్రణతో వీధిలైట్లు ఆన్ అండ్ ఆఫ్, గాలిలో తేమశాతం, ఉష్ణోగ్రతను లెక్కించే పరికరం, బ్లైండ్ మ్యాన్ స్టిక్, ఆటోమేటిక్ డస్ట్‌బిన్, మూత్రపిండాలు, జీర్ణవ్యవస్థతో పాటు పలు నమూనాలను విద్యార్థులతో తయారు చేయించారు.



ఎ.కోడూరు హైస్కూల్‌లో గల ఏటీ ల్యాబ్

**జిల్లాలో 28 ఏటీ ల్యాబ్‌లు**

జిల్లాలో 28 ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏటీ ల్యాబ్‌లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. అత్యాధునిక పరికరాలతో వీటిని ఏర్పాటు చేశారు.

కె.కోటపాడు, ఎ.కోడూరు హైస్కూళ్లతో పాటు చోడవరం, చీడికాడ, ఎస్.రాయవరం, దేవరాపల్లి, మాడుగుల, నర్సీపట్నం, కోటవురట్ల, మునగపాక, అనకాపల్లి మండలాల్లో గల హైస్కూళ్లలో ల్యాబ్‌లను ఏర్పాటు చేసి ప్రయోగాలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఎ.కోడూరు ఏటీఎల్‌ను ఏటీ హబ్‌గా విద్యాశాఖాధికారులు ఎంపిక చేశారు.

**మంచి ఫలితాలు**



ఎ.కోడూరు హైస్కూల్‌లో ఏటీఎల్ హబ్‌లో విద్యార్థులు ప్రయోగాలు చేస్తున్నారు. దీంతో విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఆసక్తి, పట్టు పెరుగుతోంది. మంచి ఫలితాలను రాబడుతున్నారు.

– డి.ఎస్.వి.ఆర్.వై.నాయుడు, ఏటీఎల్ హబ్ టీచర్, ఎ.కోడూరు

**విద్యార్థుల్లో ఆసక్తి**



విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి, వివిధ ప్రయోగాలు చేసేలా ఏటీఎల్‌ను తీర్చిదిద్దారు. సైన్స్ పాఠ్యాంశాలపై భయం తొలగడంతో మంచి మార్కులు సాధిస్తున్నారు. ఏటీ ల్యాబ్ వల్ల విజ్ఞానం పెరుగుతోంది.

– అనురాధ, ప్రధానోపాధ్యాయురాలు, ఎ.కోడూరు

**ఉపయోగకరంగా..**



వివిధ ప్రయోగాలు చేసేందుకు వీలుగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయి. తరగతిలో విన్నదానితో పాటు ప్రయోగాలు చేయడం ద్వారా తెలుసుకున్న విషయాలు పూర్తిస్థాయిలో గుర్తుంటున్నాయి. దీంతో సైన్స్ పాఠ్యాంశాలపై గతంలో ఉన్న భయం పోయింది. మంచి మార్కులను తప్పనిసరిగా సాధిస్తామన్న ధీమా పెరిగింది.

– పి.శివప్రసాద్, 10వ తరగతి విద్యార్థి, ఎ.కోడూరు.

### 21న వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవ కరపత్రాలను విడుదల చేస్తున్న ఉత్సవకమిటీ సభ్యులు

**తుమ్మపాల:** పట్టణంలో ఈ నెల 21వ తేదీ శనివారం వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బొద్దపు ప్రసాద్ తెలిపారు. స్థానిక సీతారామ కల్యాణమండపంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి యడ్ల గోవింద, ఉపాధ్యక్షులు రౌతు సతీష్, దోమ రౌతు రవిశంకర్, సహాయ కార్యదర్శులు మద్దాల చిరంజీవి, కరణం గౌరీ, కోశాధికారి ఉమామహేశ్వరరావు, పెద్దలు ఎం.కూర్మారావు, జనపరెడ్డి శ్రీరాములు, ముత్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### నర్సీపట్నం ఆర్డీవోగా జయరాం బాధ్యతల స్వీకరణ



**నర్సీపట్నం:** నర్సీపట్నం ఆర్డీవోగా హెచ్.వి.జయరాం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీవో భవానీ శంకర్‌కు సీఎంవో కార్యాలయానికి బదిలీ అయింది. నర్సీపట్నం ఆర్డీవోగా తిరిగి జయరాంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. డివిజన్‌లోని తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బంది ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిసి అభినందలు తెలిపారు.

## రహదారి భద్రతపై అందరికీ అవగాహన

**కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి**



రోడ్డు భద్రతా వారోత్సవాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

**తుమ్మపాల:** రహదారి భద్రతపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి అన్నారు. బుధవారం నుంచి 24 వరకు నిర్వహించనున్న రహదారి భద్రతా వారోత్సవాల బ్యానర్, కరపత్రాలను కలెక్టరేట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా రహదారి భద్రతపై ప్రజలకు పూర్తి అవగాహన కలిగేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఆటో, లారీ, స్కూల్ బస్సు డ్రైవర్లు, విద్యార్థులకు నియమ నిబంధనలపై అవగాహన కల్పించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు గల కారణాలు, ప్రమాదాలకు గురైతే కలిగే నష్టాలను తెలియజేయాలన్నారు. పోలీస్, రవాణా, ఇంజినీరింగ్, వైద్యశాఖల అధికారులు సమన్వయంతో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్టు ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెడ్‌జోన్లపై నిత్యం దృష్టి సారించి ఉంచాలని, ఇంజినీరింగ్ పనుల్లో తాత్సారం చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, జిల్లా రవాణా అధికారి వీర్రాజు, డీఎంహెచ్‌వో డాక్టర్.హేమంత్, సీపీవో రామారావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రకాష్, రాజన్న, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## సచివాలయంలో అగ్నిప్రమాదం

- కంప్యూటర్లు, రికార్డులు దగ్ధం



గదిలో మంటలు చెలరేగుతున్న దృశ్యం

**మాడుగుల:** మండలంలోని సత్యవరం సచివాలయంలో బుధవారం రాత్రి మంటలు చెలరేగి కంప్యూటర్లతో పాటు రికార్డులు కాలి బూడిదయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. సచివాలయ సిబ్బంది ఎవరూలేని సమయంలో రాత్రి 7.30 గంటలకు మంటలు వ్యాపించాయి. ఆ దగ్గరలో ఉన్న కొంతమంది యువకులు, గ్రామస్తులు గమనించి మంటలను అదుపు చేశారు. అప్పటికే సిబ్బంది గదిలో ఉన్న రెండు కంప్యూటర్లు, రికార్డులు, కుర్చీలు దగ్ధమయ్యాయి. సచివాలయ లైన్‌మ్యాన్ చినబాబు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. ఇన్వర్టర్‌కు అమర్చిన వైర్లు సక్రమంగా లేకపోవడంతో మంటలు చెలరేగి ఉంటాయని గ్రామస్తులు చెబుతున్నారు.

## బరువెక్కిన గుండెలతో..



తులసీరావు కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన మంత్రులు, నేతలు



తులసీరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దాడి వీరభద్రరావు, ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు



హాజరైన జనం

- విశాఖ డెయిరీ చైర్మన్ దివంగత తులసీరావుకు ఘన నివాళి
- సంస్మరణ సభకు భారీగా తరలివచ్చిన ప్రముఖులు
- 30 వేల మందికిపైగా భోజనాలు
- కిక్కిరిసిపోయిన పురవీధులు

**యలమంచిలి:** విశాఖ డెయిరీ చైర్మన్‌గా తమ కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన తులసీరావు మరణాన్ని రైతులు, అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. యలమంచిలిలో బుధవారం నిర్వహించిన సంస్మరణ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి, ఆయనతో తమకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, బరువైన గుండెలతో నివాళులర్పించారు. రైతుల నుంచి అమాత్యుల వరకూ రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో యలమంచిలి తరలివచ్చారు. తులసీనగర్‌లో ఉన్న ఆడారి తులసీరావు నివాసంలో ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే దాడి వీరభద్రరావు ఆవిష్కరించారు.

**తరలివచ్చిన ప్రముఖులు**

విశాఖ డెయిరీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావు సంస్మరణ సభకు వెల్లువలా జనం, నాయకులు తరలివచ్చారు. టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాల నాయుడు, గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, డిప్యూటీ సీఎం కొలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్యేలు తిప్పలనాగిరెడ్డి, యు.వి. రమణమూర్తిరాజు, అవంతి శ్రీనివాసరావు, సమ్మంగి చిన అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు దాడి వీరభద్రరావు, రహమాన్, మళ్ల విజయ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు చొక్కాకుల లక్ష్మి, వెంకట్రావ్, దిలీప్ కుమార్, చింతకాయల సన్యాసిపాత్రుడు, పేడాడ రమణి, బొద్దపు యర్రయ్య, ఆడారి చిన్న, ఆడారి వెంకట్, గొంతిన నాగేశ్వరరావు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, టీడీపీ నేతలు, మాజీ మంత్రులు పప్పల చలపతిరావు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే గణబాబు, జెడ్పీ మాజీ చైర్మన్ లాలం భవానీ భాస్కరరావు, గండి బాబ్జీ, జనసేన నేత సుందరపు విజయ్ కుమార్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఎం.ఆంజనేయులు, జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు యలమంచిలి వచ్చారు. తులసీరావు విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆడారి తులసీరావు కుమారుడు ఆనంద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారిని పరామర్శించారు.

**30వేల మందికిపైగా భోజనాలు:** సంస్మరణ సభ సందర్భంగా తులసీరావు ఇంటికి సమీపంలో ఉన్న తోటలో విస్తృతఏర్పాట్లు చేపట్టారు. దాదాపు 30వేల మందికిపైగా భోజన సదుపాయం కల్పించారు. మంత్రుల నుంచి సామాన్యుల వరకూ అందరికీ భోజనం అందేలా తులసీరావు తనయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆడారి ఆనంద్‌కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి పర్యవేక్షించారు.

**ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా ఆడారి సేవలు:** దశాబ్దాల పాటు ఆడారి తులసీరావు చేసిన సేవా కార్యక్రమాలు అందరికీ తెలిసేలా ఏర్పాట్లు చేశారు. ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, వాటి ద్వారా ఆడారి తులసీరావు సేవలను ప్రదర్శించారు.

## మన పాఠశాలలు అదుర్స్..!

- ఉమ్మడి విశాఖ జిల్లాలో పీఎం శ్రీ కు అర్హత సాధించిన 678 పాఠశాలలు
- తొలి విడతలో మండలానికి రెండు స్కూళ్లు
- పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు



పెదగంట్యాడ మండలం నడుపూరు జెడ్పీ స్కూల్లో పరిశీలన చేస్తున్న అధికారుల బృందం

**విశాఖ విద్య/పెదగంట్యాడ :** ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకంలో చోటు దక్కించుకునేందుకు సై అంటున్నాయి. జిల్లా స్థాయి విద్యాశాఖాధికారులు ఇచ్చిన నివేదికల్లో వాస్తవికత ఎంతనేది పరిశీలన కోసం రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఉన్నతాధికారులు ఇక్కడి స్కూళ్లను చూసి శభాష్ అంటున్నారు. విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి నేతృత్వంలోని అధికారులు బుధవారం పెదగంట్యాడ, గాజువాక మండలాల్లో పర్యటించారు. నడుపూరు, గంగవరం, అక్కిరెడ్డి పాలెం జెడ్పీ హైస్కూళ్లను పరిశీలించారు. పీఎం శ్రీ పథకం అర్హత కోసమని పాఠశాల నుంచి నమోదు చేసిన వివరాల మేరకు, వాటిలో వాస్తవికత ఎంతనేది స్వయంగా చూశారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు స్వీయ పరీక్ష నిర్వహించి, విద్యాబోధనలో నాణ్యతను తెలుసుకున్నారు. నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి జరిగిన తీరును ఇక్కడి ఉపాధ్యాయులు అధికారులకు చూపించారు. రైలు బోగి మాదిరిగా ఉన్న తరగతి ప్రవేశ మార్గం వద్ద ఫొటోలు దిగారు. అందమైన పొదరిల్లు మాదిరే ఉన్న తరగతిని చూసి, బాగుందంటూ ఉపాధ్యాయులకు కితాబు ఇచ్చారు. ఎంఈవో పైడపునాయుడు అధికారులకు ఇక్కడి పరిస్థితులను వివరించారు.

**అర్హత సాధించిన 678 స్కూళ్లు**

పీఎం శ్రీ పథకంకు ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,032 స్కూళ్లు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోగా, ఇందులో 678 జిల్లా స్థాయిలో అర్హత సాధించాయి. ఇందులో విశాఖలో 173, అనకాపల్లి -403, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 102 పాఠశాలలు జిల్లా స్థాయిలో అర్హత పొందాయి. వీటిలో మండలానికి రెండు స్కూళ్లు చొప్పున తొలివిడతలో ఎంపిక చేసే నిమిత్తం ఉన్నతాధికారుల బృందం మూడు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది.



నడుపూరు జెడ్పీ సూల్లో రైలు బోగీ మాదిరిగా ఉన్న తరగతి గది ప్రవేశ ద్వారం వద్ద విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి

**ఎంపికైతే ప్రత్యేక నిధులు**

పీఎం శ్రీ పథకంకు జిల్లా స్థాయిలో అర్హత సాధించిన స్కూళ్లలో ఉన్నతాధికారుల బృందం ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయనుంది. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా విద్యారంగం అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధతో కేంద్రం సైతం ఏపీలోని స్కూళ్ల అభివృద్ధికి ఇతోధికంగా నిధులు ఇచ్చేందుకు ముందుకొస్తోంది. ఈ నేపథ్యంలోనే అధికారుల బృందం పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోందని పీఎం శ్రీ పథకంపై ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఏపీవో ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

### కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట బందోబస్తు

**ఎస్పీ గౌతమి సాలి**



**సాక్షి, అనకాపల్లి:** ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ గౌతమి సాలి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రిలిమినరీ పరీక్ష జరుగుతుందని, అనకాపల్లి జిల్లాలో మొత్తం 21 సెంటర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అనకాపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 11, చోడవరంలో 5, మునగపాకలో 2, అచ్యుతాపురంలో 2, మాకవరపాలెంలో ఒక సెంటర్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. జిల్లాలో 9,897 మంది అభ్యర్థులు పరీక్ష రాయనుండగా... వీరిలో 2,781 మహిళలున్నారని, పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్‌లో సూచించే నియమ నిబంధనలు పాటించాలని, ఫోన్లు, డిజిటల్ వాచ్, బ్లూటూత్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష హాల్లోకి అనుమతించరని చెప్పారు. పరీక్ష రాసే అభ్యర్థుల కోసం అనకాపల్లి, చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అనకాపల్లి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్‌గా డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం వ్యవహరిస్తున్నారని, జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలకు గాను 21 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను, 25 మంది అబ్జర్వర్ల నియమించారని తెలిపారు. పర్యవేక్షణకు అడిషనల్ ఎస్పీ (పరిపాలన) నోడల్ ఆఫీసర్ బి.విజయభాస్కర్, నలుగురు డీఎస్పీలు, సీఐ ర్యాంకు అధికారులను నియమించినట్టు ఎస్పీ తెలిపారు.

**పరీక్ష కేంద్రాల వివరాలు**

అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎ, బి బ్లాకులు, దాడి వీరు నాయుడు డిగ్రీ కాలేజీ, డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కాలేజీ, హై స్కూలు, సంయుక్త డిగ్రీ కాలేజీ, సర్వేపల్లి రాధాకృష్ణ జూనియర్ కాలేజీ, శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం హై స్కూల్, భాష్యం ఇంగ్లిష్ మీడియం హై స్కూల్, కె.ఎస్.ఆర్.ఎం సిటీ ఇంగ్లిష్ మీడియం హై స్కూల్, శ్రీ కన్య జూనియర్ కాలేజీ, చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉషోదయ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, శ్రీ సాయి ప్రకాష్ డిగ్రీ కాలేజీ, శ్రీ షిర్డీ సాయి శ్రీనివాస్ డిగ్రీ కాలేజీ, విద్యార్థి డిగ్రీ కాలేజీ, మునగపాక పోలీస్ స్టేషన్ పరిధిలో డావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్, ఎమ్మెస్సార్ నేషనల్ డిగ్రీ కాలేజీ, అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో కైట్స్ జూనియర్ కాలేజీ, ప్రశాంతి పాలిటెక్నిక్ కాలేజీ, మాకవరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో పరీక్షలు నిర్వహించనున్నారు.

## అదుపులోకి వచ్చిన డయేరియా

• చినతీనార్లలో కొనసాగుతున్న వైద్య శిబిరం

నక్కపల్లి: మండలంలోని చినతీనార్లలో ప్రబలిన అతిసార(డయేరియా) అదుపులోకి వచ్చింది. వాంతులు విరేచనాలతో సుమారు 20 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తీవ్రంగా బాధపడేవారికి నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఏఎన్ ఎం లు, ఆశావర్కర్లు మందులు పంపిణీ చేస్తున్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేయడం వల్ల డయేరియా అదుపులోకి వచ్చిందని డాక్టర్ కిషోర్ తెలిపారు.పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. గ్రామంలో యుద్ధప్రాతిపదికన క్లోరినేషన్ కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ ఆదేశించారు.







# దేశ నాయకులే దేవతలు, దేవుళ్లు

• ఏటా వారి పేరిట తీర్థ మహోత్సవాలు
• ఆదర్శంగా నిలుస్తున్న కె.జె.పురం గ్రామస్తులు
• విజయవాడ నుంచి విగ్రహాలు తెచ్చిన మాజీ సర్పంచ్ శ్రీరామూర్తి
• గ్రామంలో వీధులకు దేశ నాయకుల పేర్లు


పండింట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం


ప్రధాన కూడలిలో నేతాజీ విగ్రహం


పాలసొసైటీ వద్ద మన్యం వీరుడు అల్లూరి విగ్రహం


కాలనీలోని అంబేద్కర్ విగ్రహం


పాలకుర్తి శ్రీరామమూర్తి(ఫైల్)

మాడుగుల రూరల్ : దేవతామూర్తులు, అమ్మవార్లకు తీర్థాలు, ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. సంక్రాంతి వచ్చిందంటే చాలా గ్రామాల్లో గ్రామ దేవతలు, దేవుళ్ల పేరిట ఘనంగా వేడుకలు నిర్వహిస్తారు. అయితే మాడుగుల మండలంలోని మేజర్ గ్రామ పంచాయితీ కె.జె.పురంలో అంతకు మించి.. అన్న తీరున ఉత్సవాలు నిర్వహిస్తోంది. గ్రామంలో దేవతామూర్తులతోపాటు దేశ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసి, ఏటా వారి పేరిట తీర్థమహోత్సవాలు నిర్వహించడం ఇక్కడ విశేషం.

**స్వాతంత్య్ర సమరయోధులే దేవుళ్లు**

దేశ స్వాతంత్య్ర సముపార్జనకు కృషి చేసిన జాతి పిత మహాత్మా గాంధీ, పండింట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఆజాద్ సుభాష్ చంద్రబోస్, రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు తదితర మహనీయుల విగ్రహాలు ఈ గ్రామంలోని వీధుల్లో మనకు కనిపిస్తాయి. వారి పేరుతోనే ఆ వీధుల్ని పిలుస్తారు. ఈ గ్రామ తొలి సర్పంచ్ దివంగత పాలకుర్తి శ్రీరామమూర్తి 1957లో విజయవాడ నుంచి గాంధీ, నెహ్రూ, నేతాజీ విగ్రహాలను రైల్లో అనకాపల్లి వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి నాటు బండ్ల మీద గ్రామానికి తెచ్చి, వేర్వేరు చోట్ల ఏర్పాటు చేశారు. దీనికి ఆయన తన సొంత సొమ్మునే వెచ్చించారు. ఆయన హయాంలోనే ఈ విగ్రహాలకు తీర్థ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.

**పాలకుర్తి బాటలో.. :** మన్యం వీరుడు అల్లూరి విగ్రహాన్ని గ్రామానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి అతికంశెట్టి సింహాచలం తయారు చేయించి, పాల సొసైటీ వద్ద ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ముకుందపురం గ్రామ మాజీ సర్పంచ్ అయిన కర్రి శ్రీరామూర్తి ఆర్థిక సహకారంతో కాలనీలో ఎర్పాటు చేశారు. సంక్రాంతి తర్వాత వీటికి ఏటా తీర్థాలు నిర్వహించడం ఆనవాయితీ. గాంధీ తీర్థ మహోత్సవం ఏటా ఆయన వర్ధంతి మరుసటి రోజైన జనవరి 31న గాంధీ వీధి ప్రజలు నిర్వహిస్తారు. అక్టోబరు 2న గాంధీ జయంతిని కూడా అంతే వేడుకగా చేస్తారు. ఈ నెల 23న నేతాజీ జయంతిని పురస్కరించుకుని స్థానిక నేతాజీ సోల్జర్స్ యూత్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేయనున్నారు. నెహ్రూ తీర్థం ఏటా ఫిబ్రవరి 8న నెహ్రూ వీధిలో ప్రజలు నిర్వహిస్తారు. నవంబర్ 14న నెహ్రూ జయంతిని కూడా ఘనంగా చేస్తారు. అంబేడ్కర్ జయంతిని ఏప్రిల్ 14న పండగలా నిర్వహించి, పలు క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తారు. అల్లూరి సీతారామరాజు తీర్థం జూలై 4న ఘనంగా నిర్వహిస్తారు. వీరితోపాటు మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున చేపడతారు.

### మా గ్రామ ఐక్యతకు ప్రతీక



దేశ నాయకులు విగ్రహాలకు తీర్థాలు నిర్వహించడం ఐక్యతకు ప్రతీకగా పేర్కొంటాం. కీర్తి శేషులు పాలకుర్తి శ్రీరామూర్తి ఈ విగ్రహాలను గ్రామంలో ఏర్పాటు చేశారు. ఆయన చూపిన బాటలోనే మా గ్రామం తీర్థాలు, వర్ధంతి, జయంతి కార్యక్రమాలు చేస్తోంది.

– ఆదారి కన్నారావు, కె.జె.పురం

### చిన్నప్పటి నుంచీ ఇదే తీరు



చిన్నప్పటి నుంచి దేశ నాయకుల విగ్రహాలకు తీర్థాలు చెయ్యడం చూస్తున్నాను. దేశ నాయకుల పేర్లనే వీధులకు పెట్టారు. పోస్టల్ అడ్రసులో గాంధీ వీధి, నెహ్రూ వీధి.. తదితర పేర్లనే పేర్కొంటాం. పాలకుర్తి శ్రీరామమూర్తి కృషే దీనికి కారణం.

– పాలకుర్తి రాంజీ, కె.జె.పురం

# సమయ పాలన తప్పనిసరి

• పాఠశాలల పునఃప్రారంభం రోజు పక్కా సమాచారం ఉండాలి
• యాప్‌లోనే హాజరు నమోదు చేయాలి
• వెబ్‌నార్‌లో జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి



నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

నక్కపల్లి: దాదాపు పది రోజుల పండగ సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలు తెరచిన రోజున నిర్దేశిత సమచారంతో పక్కాగా సిద్ధం కావాలని జిల్లా విద్యాశాఖ అన్ని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసింది. బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో వెబ్‌నార్‌లో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను వివరించారు.

➡ ఉదయం 9 గంటలలోపు ఉపాధ్యాయులంతా పాఠశాలలకు హాజరై, ఫేస్ యాప్‌లో తమ హాజరు నమోదు చేసుకోవాలి.

➡ ఉదయం 10.30 గంటలకు పిల్లల హాజరును స్టూడెంట్ యాప్‌లో నమోదు చేయాలి.

➡ పాఠశాలల ప్రారంభం నాటికి బియ్యం, పప్పులు, గుడ్లు, చెక్కీలు సిద్ధంగా ఉండాలి.

➡ ఎండీఎం(జగనన్న గోరుముద్ద) రికార్డులు అప్‌డేట్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలి.

➡ మధ్యాహ్న భోజనాన్ని ఖచ్చితంగా గ్యాస్ స్టౌవ్ మీదే తయారు చేయాలి.

➡ బియ్యం, పప్పు, కూరగాయలు పరిశుభ్రమైన నీటితో కడగాలి.

➡ శుభ్రమైన వస్త్రాన్ని నీటిమీద ఉంచి వడకట్టిన నీటినే వినియోగించాలి.

➡ ఎండీఎం అటెండెన్స్ ఉదయం 11 గంటల్లోపు సబ్మిట్ చేయాలి.

➡ ఎంఈవోలు ఎండీఎం వివరాలను మధ్యాహ్నం 2 గంటల్లోపు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలి.

➡ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు మధ్యాహ్న భోజన పథకాన్ని సందర్శించేలా సూచనలు జారీ చేయాలి.

➡ నిర్ధారిత మెనూ బోర్డును ప్రదర్శించి, దాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి.

➡ తరగతి గదిలో విద్యార్థులందరి వద్ద అచ్చు పుస్తకాలు ఉండేలా చర్యలు తీసుకోవాలి. మేపింగ్ పూర్తయిన పాఠశాలల్లో ఇది ఖచ్చితంగా అమలు జరగాలి.

➡ సమ్మేటివ్ అసెస్మెంట్ జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తిచేయాలి.

➡ ఏ రకమైన తప్పులు దిద్దుబాట్లు లేకుండా పూర్తి చేసి మార్కులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.

➡ ఉపాధ్యాయులందరి వద్ద పాఠ్య ప్రణాళికలు, ఈ నెల సిలబస్‌కు అనుగుణంగా డైరీలు, తరగతి గదిలో బోధన సమయంలో ఉండాలి.

➡ ట్యాబ్‌ల ద్వారా ప్రారంభించిన బోధనలో నేటి వరకు పిల్లలు నేర్చుకున్న అంశాలకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉండాలి.

➡ లిప్‌కు సంబంధించిన మాడ్యూల్స్ అందుబాటులోఉంచి, వాటి ప్రకారం బోధన చేస్తూ పిల్లల సామర్థ్యాన్ని గుర్తించి సదరు సమాచారాన్ని రికార్డు రూపంలో పొందుపరచాలి.

➡ టీఏఆర్‌ఎల్‌కు సంబంధించి పాఠశాలలకు అందజేసిన టీఎల్‌ఎంలను వినియోగిస్తూ పిల్లల సామర్థ్యాన్ని గుర్తించి, రికార్డుల రూపంలో పొందుపరచాలి.

➡ పాఠశాలలో రక్తహీనత గల పిల్లల వివరాలు, సమస్య నివారణకు తీసుకుంటున్న చర్యల సమాచారం అందుబాటులో ఉండాలి.

➡ అందరు పిల్లలు యూనిఫాం ధరించి, షూస్ వేసుకుని జగనన్న విద్యా కానుక కిట్లతో పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి.

➡ నాడు నేడు పాఠశాలల్లో పనులన్నీ ప్రారంభమయ్యేటట్లు చర్యలు చేపట్టి, రికార్డులు, రిజిస్టర్లను అప్‌డేట్ చేసుకోవాలి.

➡ నాడునేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో వర్క్ ఇన్ ప్రోగ్రెస్ తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయాలి.

➡ ఏ పాఠశాలల్లో కూడా తరగతి గదుల్లో అచ్చు పుస్తకాలు కానీ జేవికే మెటీరియల్ కానీ గుట్టలు గుట్టలుగా పడి ఉంటే చర్యలు తప్పవు.

➡ ఉపాధ్యాయులంతా సమయ పాలనతోపాటు, పైన పేర్కొన్న అంశాలన్నింటిని ఖచ్చితంగా పాటించాలని డీఈవో పేర్కొన్నారు.

## సోనోవిజన్‌లో కొనుగోలుదారుడికి హోండా అమేజ్


సోనోవిజన్ షోరూంలో లక్కీ డ్రా తీస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దొండపర్తి(విశాఖ దక్షిణ): సోనోవిజన్ సంక్రాంతి సేల్ లక్కీ డ్రాలో ఎంవీపీ కాలనీకి చెందిన కొనుగోలుదారుడు ఎం.సూర్యనారాయణ హోండా అమేజ్ కారును గెలుచుకున్నాడు. సంక్రాంతి సందర్భంగా విశాఖ సోనోవిజన్ షోరూంలలో ఎలక్ట్రానిక్ ఉపకరణాలను కొనుగోలు చేసిన వారికి లక్కీ డ్రా బహుమతులుగా హోండా అమేజ్ కారు, ఎల్ఈడీ టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్లను ప్రకటించారు. దీని ప్రకారం డైమండ్ పార్క్ వద్ద సోనోవిజన్ షోరూంలో లక్కీ డ్రా నిర్వహించారు.

విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కొనుగోలుదారుల సమక్షంలో డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ఇందులో ఎంవీపీ కాలనీ సెక్టర్–6కు చెందిన ఎం.సూర్యనారాయణ(కూపన్ నెంబర్–114279) హోండా అమేజ్ కారును గెలుచుకున్నారు. అలాగే ఎల్ఈడీ టీవీని సాగర్‌నగర్ ప్రాంతానికి చెందిన సి.హెచ్.సత్యవతి(కూపన్ నెంబర్–919592), రిఫ్రిజిరేటర్‌ను అక్కయ్యపాలెంకు చెందిన ఎస్.వెంకటరమణ(కూపన్ నెంబర్–059874), వాషింగ్ మెషీన్‌ను అల్లిపురానికి చెందిన కె.సౌందర్య(కూపన్ నెంబర్–142717) గెలుచుకున్నారు. సోనోవిజన్ అందరి కన్నా తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్ అందిస్తూ ఏపీలో అతిపెద్ద ఎలక్ట్రానిక్ స్టోర్‌గా అవతరించిందని సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ పి.భాస్కరమూర్తి పేర్కొన్నారు.

# స్టాఫ్ నర్సుల ఎంపిక నిలుపుదల

• తప్పులు తడకలతో తుది జాబితా
• అన్యాయం జరిగిందని నర్సుల నిరసన
• సిబ్బందిపై అవినీతి ఆరోపణలు
• 'సాక్షి'లో కథనంతో ఉలికిపాటు
• జాబితాను మళ్లీ పరిశీలిస్తున్న అధికారులు
• అర్హులకు అన్యాయం జరగదంటున్న ఆర్డీ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ ప్రక్రియ తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందని నిరుద్యోగ నర్సులు, వెయిటేజీ మార్కులు కలపలేదని తాత్కాలిక ఉద్యోగులు బుధవారం కూడా తన నిరసన గళం వినిపించారు. దాదాపు 30 నుంచి 40 మందికి వెయిటేజ్ మార్కులు కలపలేదని విషయం బయటకు రావడంతో.. ఈ జాబితాను పునఃపరిశీలన కోసం అధికారులు భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. స్టాఫ్ నర్సుల ఎంపికలో గందరగోళంపై బుధవారం 'సాక్షి'లో కథనం రావడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. తప్పుల తడకలతో కూడిన 172 మంది అభ్యర్థుల జాబితాను మళ్లీ పరిశీలన చేస్తున్నారు. కొంత మందికి అనవసరంగా ఎలా మార్కులు కలిశాయన్న దానిపై యంత్రాంగం దృష్టి పెట్టింది. అమరావతి నుంచి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విశాఖ చేరుకుని జాబితాను పరిశీలిస్తున్నారు.

స్టాఫ్ నర్సుల పోస్టుల కోసం ఇప్పటివరకు నాలుగు సార్లు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది జాబితాను తయారు చేశారు. ప్రభుత్వం జీవో ప్రకారం జాబితా తయారు చేశామని చెబుతున్నప్పటికీ.. ఎంపికలో సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హులను తప్పించడం, అనర్హులను అందలం ఎక్కించడం కోసం సిబ్బంది చేతివాటం ప్రదర్శించారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఎంపికైన 172 మందిలో 100 మంది సర్టిఫికెట్లను మంగళవారం పరిశీలించారు. బుధవారం మరో 30 మంది సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. జాబితాను పునఃపరిశీలన చేస్తున్న క్రమంలో ఇందులో ఎంత మంది పేర్లు ఉంటాయో.. ఊడతాయో మరి.! కాగా.. ఎంపిక జాబితా రూపొందించడంలో సిబ్బంది తీరుపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. తమ జీవితాలతో సిబ్బంది చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి మార్కులు కలపడం, మరోసారి తొలగించడం, ఎంపిక జాబితాలో కొందరి పేర్లు ఇప్పుడు తొలగించడం.. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

**అభ్యర్థుల్లో ఉత్కంఠ**

పోస్టుల సంఖ్య పెరగడం, కోవిడ్ సమయంలో పని చేసిన వారికి అదనపు మార్కులు కలపడం వంటి నిర్ణయాలు రావడంతో మెరిట్ లిస్ట్‌కు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి ఆధ్వర్యంలో తుది మెరుగులు దిద్దుతున్నారు. అమరావతి నుంచి వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కూడా ఇందుకు సహకారం అందిస్తున్నారు. దీంతో కొత్త జాబితా కోసం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల అభ్యర్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. కాగా..అర్హులకు అన్యాయం జరగదని డాక్టర్ ఉమా సుందరి హామీ ఇస్తున్నారు.

## నేడు, రేపు రాష్ట్ర ఆహారకమిషన్ సభ్యుడి పర్యటన

తుమ్మపాల: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు జిల్లాలో ఈ నెల 19,20 తేదీల్లో పర్యటించనున్నట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి కె.వి.ఎస్.ఎం. ప్రసాద్ తెలిపారు. జిల్లాలో అమలు జరుగుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత బియ్యం పంపిణీ, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు జరుగుతున్న పోషకాహార పథకాలపై పర్యవేక్షణ, తనిఖీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రధానమంత్రి మాతృవందన పథకం అమలుపై సమీక్షిస్తారని తెలిపారు.

## డిప్లొమా, బీటెక్ విద్యార్థులకు ఉపాధి శిక్షణ

రోలుగుంట: డిప్లొమా, బీటెక్ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంటు జనరేషన్, ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా ఉచిత శిక్షణ, ఉపాధి అవకాలు కల్పిస్తున్నట్టు ఎంపీడీవో కె.ప్రభాకరరావు, స్కిల్ డెవలప్‌మెంటు కోఆర్డినేటర్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. డిప్లొమా, బీటెక్ చదివిన వారికి మెకానికల్, ప్రొడక్ట్ ఆటోమొబైల్ బ్రాంచ్‌ల్లో ఆరు నెలల పాటు అచ్యుతాపురం మండలంలోని ఎంఎస్‌ఎంఈలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణకాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. తరువాత ఉద్యోగాలు కల్పిస్తారని, ఆసక్తి ఉన్న వారు మరింత సమాచారం కోసం 9494791935 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. మధురవాడ నుంచి తుని వెళుతున్న బైక్‌ను తాళ్లపాలెం వద్ద ఈనెల 13న రోడ్డు మలుపు తిరుగుతున్న లారీ ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న మధురవాడకు చెందిన బోడా సాయిభరత్ నాయక్, మిత్రుడు మల్లికార్జున తీవ్రంగా గాయపడ్డారు. వీరిని విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. నాయక్ తండ్రి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


కశింకోట: స్థానిక గోవిందరావు కాలనీకి చెందిన గాడి సూరిబాబు(44) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఈనెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, ఎక్కడ వెదికినా ఆచూకీ లేకపోవడంతో భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## యువకుడు అదృశ్యం


నర్సింహమూర్తి

కె.కోటపాడు: మండలంలోని దాలివలస గ్రామానికి చెందిన ఆదిరెడ్డి నర్సింహమూర్తి(19) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. రెండురోజులుగా కనిపించడం లేదని అతని సోదరుడు పూర్ణ చందరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎ.కోడూరు ఎస్ఐ రామకృష్ణ బుధవారం తెలిపారు. నర్సింహమూర్తికి మతిస్థిమితం సరిగా లేదని, 17వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయి ఇప్పటికీ తిరిగి రాలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్ఐ చెప్పారు.

## జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేత వాడ్రాపల్లి


కబడ్డీ పోటీలు జరుగుతున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతగా వాడ్రాపల్లి జట్టు నిలిచింది. అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోటీల్లో ఫైనల్ పోటీ మంగళవారం అర్ధరాత్రి జరిగింది. జగన్నాథపురం జట్టుకు ద్వితీయ స్థానం, కొండకర్ల(శ్రీకృష్ణ) జట్టుకు తృతీయ స్థానం, కొండకర్ల(యల్లారమ్మ) జట్టుకు నాలుగో స్థానం, గెద్దరాజాం జట్టుకు ఐదవ స్థానం లభించాయి. గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన ఈ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

## వచ్చే నెల 4 నుంచి అగ్నివీర్ వాయు రిక్రూట్‌మెంట్ ర్యాలీ

తుమ్మపాల: అగ్నిపథ్ పథకంలో అగ్నివీర్ వాయులో చేరాలనుకునే నిరుద్యోగ యువకులకు భారత వైమానిక దళం ఫిబ్రవరి 4 నుంచి 8 వరకు తమిళనాడులో తాంబరం ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు సెట్విస్ సీఈవో పి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌ఫోర్స్ గ్రూప్.వై (నాన్ టెక్నికల్) మెడికల్ అసిస్టెంట్ ట్రేడ్ కోసం ఫిబ్రవరి 4,5,7, 8 తేదీల్లో జరిగే ర్యాలీలో పాల్గొనేందుకు అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. వివరాల కోసం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వాట్సాప్ నెం. 9345377868కు, http://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో చూడొచ్చన్నారు.



# హోరాహోరీగా మహిళల కబడ్డీ పోటీలు

• నేడు కలిగొట్లలో జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు


ఎ.కొత్తపల్లిలో పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ

దేవరాపల్లి: శ్రీముత్యమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఎ.కొత్తపల్లిలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి మహిళల కబడ్డీ పోటీలు హోరా హోరీగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా ఈ పోటీలకు 12 జట్లు హాజరయ్యాయి. ముందుగా క్రీడాకారులతో పరిచయ కార్యక్రమం అనంతరం పోటీలను స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి తదితర గ్రామ పెద్దలు ప్రారంభించారు. అర్ధరాత్రి వరకు ఈ పోటీలు జరుగుతాయని సర్పంచ్ తెలిపారు. పోటీలను తిలకించేందుకు మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు. తీర్థ మహోత్సవం సందర్భంగా ముత్యమాంబ అమ్మవారికి గ్రామస్తులు తెల్లవార జాము నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి ఏర్పాటు చేసిన పౌరాణిక నాటకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

**కలిగొట్లలో జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నేడు**

కలిగొట్లలో పైడితల్లి అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలను ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దల సహాయ సహకారాలతో నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి తెలిపారు. ఈ పోటీలలో విజేతలకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు చొప్పున వరుసగా నగదు బహుమతులను అందజేయనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం


క్లబ్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న క్లబ్ జిల్లా గవర్నర్ సత్య వరహాలరావు

కశింకోట : కశింకోటలో వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం పదవీ స్వీకార ప్రమాణోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జంగాల సూకరాజు, బి.వి.కె గుప్తా, కోశాధికారి కోలాటి సతీష్ ఎన్నికయారు. వీరి చేత వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ పులవర్తి సత్యవరహాలరావు పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా క్లబ్ ఇంటర్నెషనల్ ఐఈసీ ఆఫీసర్ డాక్టర్ సీఎస్ కుమార్, రీజనల్ చైర్మన్ భరత్ కుమార్, కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, జోన్ చైర్మన్-2 గోగుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ


పేదలకు వస్త్రాలు అందిస్తున్న మహాలక్ష్మినాయుడు

అనకాపల్లిటౌన్ : స్థానిక పీలావారి గౌరీపరమేశ్వరుల ఆలయం బుధవారం ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు భీమరశెట్టి మహాలక్ష్మినాయుడు, బుద్ద శివ 250 మంది పేదలకు వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా పేదలకు వస్త్రాలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలవకర్గ సభ్యులు పాల్గొన్నారు.

### కోడిపందాలపై పోలీసుల దాడి

కశింకోట : మండలంలోని రెండు వేర్వేరు గ్రామాల్లో కోడి పందాలపై దాడి చేసి నలుగుర్ని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు.కన్నూరుపాలెంలో కోడి పందాలు ఆడుతుండగా బుధవారం దాడి చేసి రెండు పందెం కోళ్లు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితుల్ని పట్టుకొని అరెస్టు చేశామన్నారు. అలాగే పరవాడపాలెం గ్రామంలో కూడా కోడి పందాలపై దాడి చేసి మంగళవారం రాత్రి రెండు పందెపు కోళ్లను స్వాధీనం చేసుకొని ఇద్దర్ని అరెస్టు చేశామన్నారు. కొత్తపల్లి గ్రామంలో గుళ్లాట ఆడుతున్న ఇద్దర్ని పట్టుకొని అరెస్టు చేసి రూ.1690 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లంమార్కెట్‌కు బుధవారం 3,612 బెల్లందిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ | 3,440 | 3,920 |
| మొదటిరకం | 2,970 | 3,320 |
| రెండోరకం | 2,860 | 2,960 |
| మూడోరకం | 2,750 | 2,850 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| ధమాకా | - రాజా |
| వాల్తేరు వీరయ్య | - సత్యనారాయణ స్క్రీన్-1 |
| వీర సింహారెడ్డి | - సత్యనారాయణస్క్రీన్-2 |
| 18 పేజెస్ | - షిర్డిసాయి |
| వాల్తేరు వీరయ్య | - పర్తిసాయి |
| వీర సింహారెడ్డి | - వెంకటేశ్వర |
| లవ్ టుడే | - శ్రీసత్య |
| వాల్తేరు వీరయ్య | - రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 68 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-18 యూనిట్లు, ఏ నెగిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-39 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 513 మంది బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 527 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.



# జగనన్న లేఅవుట్లలో విద్యుత్ వెలుగులు


కశింకోటలోని వడ్డి వీధిలో వైఎస్సార్ జగనన్న లే-అవుట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, వైర్లు

కశింకోట : కశింకోట పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ జగనన్న లే-అవుట్లలో తాజాగా విద్యుత్ సదుపాయం కల్పించారు. ఇళ్లు పూర్తి అయిన వారికి త్వరలోనే ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి సమాయత్తం అవుతున్నారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కశింకోటలోని వడ్డి వీధిలో వైఎస్సార్ జగనన్న పేదల గృహ నిర్మాణ మెగా లే-అవుట్‌తోపాటు కోటదిబ్బ, కస్పావీధి ప్రాంతాల్లో చెరో లే-అవుట్, సత్తెమ్మ కాలనీలో రెండు లే-అవుట్లను ఏర్పాటు చేశారు. వీటిలో 482 మంది ఇళ్లు నిర్మించుకుంటున్నారు. మరో 166 మంది సొంత స్థలాలు ఉన్న వారికి ఇళ్లు మంజూరు చేయడంతో వాటిని నిర్మించుకుంటున్నారు. ఇప్పటికే వీటిలో 125 ఇళ్ల నిర్మాణం పూర్తి అయింది. మిగిలిన ఇళ్లు పునాది స్థాయి నుంచి లింటల్, శ్లాబ్, తదితర స్థాయిలో నిర్మాణంలో ఉన్నాయి. అయితే వీటిలో పూర్తయిన ఇళ్లలో కొందరు లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసి నివాసం ఉంటున్నారు. అయితే వారికి ఇప్పటి వరకు విద్యుత్ సదుపాయం లేదు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా కొందరు వాటిలోనే నివాసం ఉంటున్నారు. మరికొందరు గృహ ప్రవేశాలు చేసినా విద్యుత్ సదుపాయం లేక ఇళ్లలో చేరలేదు. ఈ నేపథ్యంలో త్వరితగతిన ఏపీఈపీడీసీఎల్ ద్వారా లే-అవుట్లలో స్తంభాలు ఏర్పాటు చేసి వైర్లు అమర్చి ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి తాజాగా విద్యుత్ సరఫరా చేశారు. దీంతో ఇళ్లలో నివాసం ఉంటున్న లబ్ధిదారుల్లో సత్వరమే కావలసిన కొందరికి సొంత కనెక్షన్ ఇచ్చి విద్యుత్ సదుపాయం కల్పించారు. ఇంకా మిగిలిన పూర్తయిన ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మేరకు త్వరలోనే విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ నుంచి ఏపీఈపీడీసీఎల్ అధికారులకు పూర్తయిన ఇళ్ల జాబితాను రూపొందించి ఉచిత విద్యుత్ కనెక్షన్ల కోసం ఇప్పటికే సిఫార్స్ చేశారు. దీంతో విద్యుత్ అధికారులు లే-అవుట్లలో విద్యుత్ సదుపాయం కల్పించి ఉచిత కనెక్షన్లు ఇవ్వడానికి సిద్ధం అవుతున్నారు. దీంతో కనెక్షన్ కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు విద్యుత్ సదుపాయం రానుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### ఎంతో ఆనందంగా ఉంది



జగనన్న కాలనీకి విద్యుత్ సదుపాయం కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. విద్యుత్ లేక ఇప్పటి వరకు నివాసం ఉండటానికి ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు కనెక్షన్ ఇవ్వడంతో విద్యుత్ సదుపాయం కలిగింది.

-తమరాన వరలక్ష్మి, వడ్డెర వీధి, కశింకోట

### విద్యుత్ సదుపాయంతో గృహప్రవేశాలు



వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ లే-అవుట్‌లో త్వరితగతిన స్తంభాలు, వైర్లు అమర్చి విద్యుత్ సరఫరా చేపట్టడం వల్ల తమ ఇళ్లకు ఇక విద్యుత్ సదుపాయం కలగనుంది. ఇప్పటి వరకు విద్యుత్ లేక గృహ ప్రవేశం అయినప్పటికీ ఇళ్లలో చేరలేదు. ఇక విద్యుత్ సదుపాయం రావడంతో ఆ వెలితి తీరనుంది.

-కర్రి పైడితల్లి, వడ్డెర వీధి, కశింకోట

### త్వరలోనే ఉచిత విద్యుత్ కనెక్షన్



కశింకోటలోని ఐదు వైఎస్సార్ జగనన్న లే-అవుట్లతోపాటు సొంత స్థలాల్లో మంజూరు చేసిన 648 ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. వీటిలో 125 ఇళ్లు పూర్తి కావడంతో వాటికి విద్యుత్ సదుపాయం కల్పించాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులకు సిఫారసు చేస్తూ నివేదించాం. లే-అవుట్లలో ఇప్పటికే విద్యుత్ సదుపాయం కల్పించారు. త్వరలోనే ఇళ్లకు ఉచిత విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నారు.

-వి.శ్రీనివాసరావు, ఏఈ, గృహ నిర్మాణ శాఖ, కశింకోట

# సంక్షేమ పథకాలకు అర్హతే కొలమానం

**-రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్**


వృద్ధురాలి ఆశీర్వదం తీసుకుంటున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : సంక్షేమ పథకాల అమలుకు అర్హతే కొలమానమని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అక్కిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. అన్ని అర్హతలు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు అర్హులని పేర్కొన్నారు. సుమారు మూడుగంటలపాటు ప్రతి గడపకు వెళ్లి సమస్యలతోపాటు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును గ్రామస్తుల నుంచి రాబట్టారు. ఇంకా ఎవరైనా సంక్షేమ పథకాలు అందని వారుంటే నేరుగా తనను సంప్రదించాలని కోరారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతున్న సీఎం జగన్‌కు ప్రజలు అండదండలు అందించాలని కోరారు.

**నాకో గూడు ఇప్పించవా...**

రెండు కాళ్లు చచ్చుబడిపోయి లేవలేని స్థితిలో కుంగిపోయాను నాకొక ఇల్లు ఇప్పించవా అంటూ దివ్యాంగులు లక్ష్మీ మంత్రి అమర్‌నాథ్‌కు తన ఆవేదన వెలిబుచ్చుకుంది. అక్కడే ఉన్న హౌసింగ్ అధికారులను పిలిచి లక్ష్మికి వెంటనే ఇంటి స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి కావాల్సిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదే గ్రామానికి చెందిన దివ్యాంగుడైన వెంకట అప్పారావును మంత్రి అమర్‌నాథ్ పరామర్శించారు. అప్పారావు తల్లిదండ్రులు దివ్యాంగ పింఛన్ వస్తున్నప్పటికీ సరిపోవడం లేదని, తమకు ఇంటిస్థలం మంజూరు చేయాలని కోరారు. మంత్రి అమర్‌నాథ్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సచివాలయ కన్వీనర్లు నారపిన్ని ప్రసాద్, మామిడి ధనలక్ష్మీ, శీరంశెట్టి అప్పలరాజు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

# 28న రాజుపాలెం కొండపై రథసప్తమి వేడుకలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ

అనకాపల్లిటౌన్ : విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణస్వామి కొండపై ఈనెల 28 నిర్వహించే రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను స్వగృహంలో బుధవారం ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు సప్తమి వేడుకల పోస్టర్‌ను మంత్రి అమర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సప్తమి వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన ఆదేశించారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం


చెరకు పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

మాడుగుల రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే నెల 15వ తేదీలోపు ధాన్యం కొనుగోలు చెయ్యాలని సంబంధిత సిబ్బందిని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు సూచించారు. బుధవారం ఆయన మాడుగుల మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో వీఏఏలు, వీహెచ్‌ఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేడ్ల ఆధారంగా కొనుగోలు ధరపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఏ గ్రేడ్‌కు రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040తో కొనుగోలు చేయాలన్నారు. అనంతరం కె.జె.పురంలో బోడ్డేడ ఆనంద్ అనే రైతు పండించిన చెరకు తోటలో చేస్తోన్న పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఈ ప్రయోగం ద్వారా గ్రామంలో చెరకు పంట సరాసరి దిగుబడి ఒక ఎకరానికి 22 టన్నుల వరకు రావచ్చని అంచనా వేశారు. ఈ రబీ సీజన్‌లో రైతులు పండిస్తున్న వరి, అపరాల సాగుకు సంబంధించి ఈ క్రాప్ నమోదును వచ్చే నెల 10లోపు పూర్తి చేయాలని సూచించారు. ఈయన వెంట మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు, సహాయ గణాంక అధికారి చంద్రమౌళి, వ్యవసాయ విస్తరణాధికార్లు డి.సత్యనారాయణ, బి.జగన్నాథరావు, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

# డ్రోన్ ద్వారా పరీక్ష కేంద్రం పర్యవేక్షణ


మునగపాక ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద డ్రోన్ ద్వారా పర్యవేక్షిస్తున్న దృశ్యం

మునగపాక : ఈనెల 22న జరగనున్న పోలీసు కానిస్టేబుల్ పరీక్షకు సంబంధించి కేటాయించిన కేంద్రాలను బుధవారం డ్రోన్ ద్వారా పోలీసు అధికారులు పర్యవేక్షించారు. తిమ్మరాజుపేటలోని డ్యావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్లో 300 మంది అభ్యర్థులు అలాగే స్థానిక ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో 240 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఈమేరకు సంబంధిత కళాశాలలో పరిస్థితులను తెలుసుకునేందుకు డ్రోన్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని ఎస్ఐ భీమరాజు తెలిపారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

### ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

కశింకోట : కశింకోటలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, బసవరామతారకం దంపతుల విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉగ్గిన రమణమూర్తి, పెంటకోట రాము, సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు షేక్ దర్గా తదితరులు పాల్గొన్నారు.

### టెన్త్ విద్యార్థులకు 21న క్విజ్ పోటీ

కోటవురట్ల : విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు పదో తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.కొండబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన కళాశాల అధ్యాపకులు, వాకర్స్ క్లబ్ సభ్యుల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్విజ్ పోటీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పదో తరగతికి సంబంధించి అన్ని సబ్జెక్టులపై క్విజ్ పోటీ ఉంటుందని ఆయన తెలిపారు. గెలుపొందిన టీమ్‌కు ప్రథమ బహుమతిగా రూ.2 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1500, తృతీయ బహుమతిగా రూ.1000 అందించనున్నట్టు తెలిపారు. వివరాలకు 8978896251ను సంప్రదించాలని సూచించారు.

### సచివాలయ సమన్వయకర్తలు వీరే

అనకాపల్లిటౌన్: నియోజకవర్గ జగనన్న సచివాలయ సమన్వకర్తలను జేసీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ హర్షవర్ధన్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. మండల ఇన్‌చార్జిగా ఎంపీపీ గొర్లి సూరిబాబు, పట్టణ ఇన్‌చార్జిగా మందపాటి జానకీరామరాజు, జీవీఎంసీ 81, 82, 83, 84వ వార్డులకు ఇన్‌చార్జిగా మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, 80, 81, 84వవార్డుల ఇన్‌చార్జిగా ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడును నియమించారు. వీరు రానున్న ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లను, గృహసారధులను, వలంటీర్లను, స్థానిక పార్టీ నాయకులను సమన్వయపరుచుకొని వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయనున్నారు.

### గౌరీపరమేశ్వరులకు ఘనంగా సారె


సారె తీసుకువస్తున్న భక్తులు

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో నిలిపిన శ్రీ గౌరీపర్వమేశ్వరి ఉత్సవమూర్తులకు బుధవారం సారె సమర్పించారు. గ్రామంలో ప్రతి ఏడాది కార్తీక మాసం మొదలు కొని మూడు నెలలు పాటు స్వామికి ప్రత్యేక పూజలు అందిస్తూ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా భక్తులు సారె సమర్పించారు. ఈ కార్యక్రమానికి గవర కార్పొరేషన్ డైరక్టర్ కొణతాల ఉమాదేవి, కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొని సారె సమర్పించారు.

### ఆకట్టుకున్న ఎడ్ల బళ్ల పోటీలు


ఎడ్ల బళ్ల పోటీలను తిలకిస్తున్న ప్రజలు

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాదిలో బుధవారం లక్ష్మీకాంతమ్మ చిట్టెమ్మ పేరంటాల తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పందెం పోటీలు ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన ఎడ్లను హుషారుగా రంకెలేయిస్తూ రైతులు పరుగులు తీయించడాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఎడ్ల పరుగు పందెం పోటీలతో పాటు ముగ్గుల పోటీలు, ఉట్టికొట్టే పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులను అందించారు.

# గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలి


కశింకోటలో సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

కశింకోట : మండలంలో వచ్చే ఉగాది నాటికి ప్రభుత్వం నిర్దేశించిన గృహ నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి అధికారులు,సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు కోరారు. కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఉపాధి పథకం అధికారులు, సచివాలయ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఉగాది నాటికి వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ పథకం లే-అవుట్లలో 628 ఇళ్లు పూర్తి చేయాలని నిర్దేశించారన్నారు. ఈ మేరకు లక్ష్య సాధనకు అంతా సమన్వయంతో పని చేయాలని, గ్రామ వలంటీర్ల సహకారం తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో 2018 ఇళ్లు మంజూరు చేశారని, వీటిలో సుమారు 400 ఇళ్లు సొంత స్థలాల్లోని, మిగిలినవి వైఎస్సార్ జగనన్న లే-అవుట్లలోను నిర్మాణం జరుగుతున్నాయన్నారు. వీటిలో 321 ఇళ్లు పూర్తి అయ్యాయని, లక్ష్యం మేరకు ఉగాదికి మిగిలిన ఇళ్లు పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరిగేలా అంతా సహకరించాలన్నారు. ఉపాధి పథకం ఏపీవో శివ, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# కేంద్రం వైఖరికి నిరసనగా ఆందోళనలు

- సీపీఐ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ


సీపీఐ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

అనకాపల్లి రూరల్: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేపడుతున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా ఈ నెల 23 నుంచి 27 వరకు చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ పార్టీ నేతలు కోరారు. బుధవారం అనకాపల్లి సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వివిధ ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి దశలవారీగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడతామని వారు తెలిపారు. ఈనెల 23,24 తేదీల్లో ఆర్డీవో కార్యాలయాల వద్ద సామూహిక నిరసనలు, 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలు, ఈనెల 27న విశాఖలో లక్ష మంది కార్మికులతో మహా గర్జన నిర్వహిస్తామని వారు తెలిపారు. ఏఐటీయుసి రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, అనకాపల్లి జిల్లా కన్వీనర్ వై.ఎన్.భద్రం, దేముడు బాబు, మత్తుర్తి సూరిబాబు, వెంకటేశ్వర్లు, బొర్ర ధర్మ పాల్గొన్నారు.

# బాలింతలకు పండ్లు పంపిణీ


ఎన్టీఆర్ ఆస్పత్రిలో బాలింతలకు పండ్లు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనకాపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు జన్మదినం సందర్భంగా అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలకు నియోజకవర్గ కాంగ్రెస్ నేత బోయిన భానుమూర్తి యాదవ్ బుధవారం పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు తామంతా సైనికుల్లా పని చేస్తామని, పీసీసీ అధ్యక్షునికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని ఆయన ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కత్తెర శేఖర్, అనకాపల్లి మండల పార్టీ అధ్యక్షుడు కాళ్ల వెంకట సత్యనారాయణ,ఆడారి రామారావు, యువజన కాంగ్రెస్ నాయకుడు బాల మురళి పాల్గొన్నారు.

# సందడిగా తీర్థ మహోత్సవాలు


ఏనుగుతునిలో బొర్రమాంబ తీర్థ మహోత్సవంలో దాడి రత్నాకర్

కశింకోట: మండలంలోని పాత కన్నూరుపాలెంలో బుధవారం సాయంత్రం తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆట వస్తువులు, తినుబండారాలు అమ్మకాలు జోరుగా సాగాయి. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ ఎస్.శివ, తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా వచ్చి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అలాగే జమాదులపాలెం గ్రామంలో తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని ఏనుగుతుని గ్రామంలో బుధవారం రాత్రి బొర్రమాంబ తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు దాడి రత్నాకర్ ఉత్సవంలో పాల్గొని అమ్మ వారిని దర్శించారు.

# యోగా మానవ జీవితంలో అంతర్భాగమవ్వాలి


విజయ్ దంపతులను సత్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: యోగా గిన్నీస్ రికార్డు విజేత కొణతాల విజయ్ దంపతులను గవరపాలెం పెదరామస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ మంగళవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో పాటు యోగా మానవజీవితంలో అంతర్భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, కోరిబిల్లి పరి, రేబాక మధుబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జనుము పంటపై రైతుల ఆసక్తి


రోలుగుంటలో కళకళలాడుతున్న జనుము పంట

రోలుగుంట: మండలంలో జనుము పంట సాగుపై రైతులు ఆసక్తి చూపారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మండలంలోని పలు గ్రామాల్లో 920 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో జనుము పంట సాగు చేస్తున్నారు. ఈ పంటకు వర్షంతో పెద్దగా పని లేదు. ఖరీఫ్‌లో సాగయిన వరి పంట పొలాల్లో కోతలకు ఒక ట్రెండు రోజులు ముందుగా వీటిని వేస్తారు. ఎకరానికి నాలుగు కేజీల జనుము విత్తనాలు సరిపోతాయి. ఈ పంట మంచు తేమకే బాగా పెరుగుతుంది. కూలీలతో ప్రయాస లేదు. దుక్కులు దున్నే అవసరమూ లేదు. కేవలం మూడు నెలల్లోపే పంట చేతికి వస్తుంది. పంట పండితే దిగుబడి కూడా బాగానే ఉంది. పెట్టుబడి విత్తనాల కొనుగోలుకు కిలోకి రూ.75 చొప్పున నాలుగు కిలోలకు రూ.300 మాత్రమే. పంట సేకరణకు తప్ప, మరే పెట్టుబడి వ్యయం ఉండదు. దిగుబడి ఎకరానికి కనీసం రూ.10 వేలు వరకు ఉంటుందని రైతులు చెప్తున్నారు. దీంతో పెద్దగా ఖర్చులేని వ్యవసాయం కావడంతో రైతులు ఖరీఫ్ సీజన్లో జనుము పంటపై ఆసక్తి చూపుతున్నట్టు వ్యవసాయాధికారులు చెప్తున్నారు.